క్లుప్తంగా

ఇంటర్‌లో అడ్మిషన్‌కు దరఖాస్తుల ఆహ్వానం

త్రిపురారం: మండలంలోని కంపాసాగర్ గ్రామపంచాయతీ పరిధిలో బాబుసాయిపేట రోడ్డులో గల టీఎస్ మోడల్ స్కూల్‌లో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంలో అడ్మిషన్ పొందేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ బూరుగు నిర్మల ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పదో తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులు ఈ నెల 25లోపు www.tsms.cgg.gov.in వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఎంపీసీ-40, బీపీసీ-40, సీఈసీ-40, ఎంఈసీ-40 సీట్లను భర్తీ చేయనున్నట్లు తెలిపారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న విద్యార్థులు దరఖాస్తు ఫారంతో పాటు పదో తరగతి మెమో, ఆధార్ కార్డు జిరాక్స్‌లను మోడల్ స్కూల్‌లో అందించాలని సూచించారు.

కుల వృత్తి పరికరాలు అందజేత



నాయీ బ్రాహ్మణులకు కుల వృత్తి పరికరాలు అందజేస్తున్న దేవేందర్‌నాయక్

దేవరకొండ: వీడీఎస్ ఫౌండేషన్ అధ్యక్షుడు, దేవరకొండ మాజీ మున్సిపల్ చైర్మన్ వడ్త్య దేవేందర్‌నాయక్ పుట్టినరోజు వేడుకలను ఆదివారం పట్టణంలోని బంజారా భవన్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంలోని 83మంది నాయీ బ్రాహ్మణులకు ఒక్కొకరికి సుమారు.రూ.3వేలు విలువ చేసే కుల వృత్తి పరికరాలను ఆయన అందజేశారు. అనంతరం కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నాయీ బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో దేవేందర్‌నాయక్‌ను ఘనంగా సన్మానించారు. వడ్త్య దేవేందర్ నాయక్(వీడీఎస్) ఫౌండేషన్ ఆధ్వర్యంలో దేవరకొండ నియోజకవర్గంలో మరిన్ని సేవా కార్యక్రమాలు చేపట్టనున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో శిరందాసు కృష్ణయ్య, ఖాదర్ బాబ, చింతకుంట్ల రాకేష్, రమేష్, సోమలింగం, నాయీ బ్రాహ్మణ సంఘం నాయకులు కామోజు విజయ్, రాసాల శ్రీనివాస్, వెలిజా సురేష్, గోలి శ్రీను, నేలపట్ల వాసు, అజయ్ తదితరులున్నారు.

చెస్ గ్రాండ్ మాస్టర్ ప్రణీత్‌కు సన్మానం



ప్రణీత్‌ను సన్మానిస్తున్న ఎమ్మెల్యే భాస్కర్‌రావు, తిప్పన విజయసింహారెడ్డి

మిర్యాలగూడ: జాతీయ స్థాయి చెస్ గ్రాండ్ మాస్టర్‌గా అవతరించిన మిర్యాలగూడ మండలంలోని ఆలగడప గ్రామానికి చెందిన ఉప్పుల ప్రణీత్‌ను ఆదివారం గ్రామంలోని జెడ్పీహెచ్‌ఎస్‌లో మిర్యాలగూడ ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్‌రావు, రాష్ట్ర ఆగ్రో ఇండస్ట్రీస్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ తిప్పన విజయసింహారెడ్డి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో జిల్లా రైతుబంధు సమితి అధ్యక్షుడు చింతరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీపీ నూకల సరళాహన్మంతరెడ్డి, మాజీ ఏఎంసీ చైర్మన్ ధనావత్ చిట్టిబాబు నాయక్, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు మట్టపల్లి సైదులుయాదవ్, పీఏసీఎస్ చైర్మన్ వెలిశెట్టి రామకృష్ణ, మండల రైతుబంధు సమితి అధ్యక్షుడు గడగోజు ఏడుకొండలు, సర్పంచులు తదితరులు పాల్గొన్నారు.

చెరువు 'ఎఫ్‌టీఎల్' పరిధిలో మట్టిపోసి చదును

- పోలీసులకు ఫిర్యాదు



చెరువు ఎఫ్‌టీఎల్ పరిధిలో పోసిన మట్టి

మాడుగులపల్లి: మండలంలోని కల్వలపాలెం గ్రామంలోని ఊర చెరువు ఎఫ్‌టీఎల్ (ఫుల్ ట్యాంక్ లెవల్)లో కొందరు రైతులు మట్టి పోసి చదును చేశారు. విషయాన్ని ఇటీవల స్థానికులు గుర్తించి నీటి పారుదల ఏఈ సాయిరెడ్డికి సమాచారం ఇవ్వడంతో ఆయన పరిశీలించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ విషయంపై సోమవారం నీటి పారుదలశాఖ అధికారులతో కలిసి క్షేత్రస్థాయిలో విచారణ నిర్వహించనున్నట్లు ఎస్‌ఐ నరేష్‌కుమార్ తెలిపారు. ఐబీ అధికారులు ఎఫ్‌టీఎల్ పరిధిని గుర్తిస్తే మట్టి పోసిన వారిని తొలగించాలని ఆదేశిస్తామని పేర్కొన్నారు. చెరువులో నీరు తక్కువగా ఉన్నప్పుడు ఎఫ్‌టీఎల్ పరిధిలో పంట పండించుకోవాలే గానీ శాశ్వత నిర్మాణాలు, మట్టిపోసి పూడ్చడం లాంటి చర్యలు చట్ట విరుద్ధమని పేర్కొన్నారు. ఊర చెరువు విస్తీర్ణం దాదాపు 5.26 ఎకరాలు కాగా కొందరు ఎకరం మేర మట్టి కట్ట పోసి చదును చేసినట్లు ఐబీ ఏఈ సాయిరెడ్డి తెలిపారు. మట్టిని తొలగించకుంటే నీటిపారుదల చట్టం ప్రకారం చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు.

దేశం గర్వించదగ్గ వ్యక్తి రాజీవ్ గాంధీ

మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ వర్ధంతిని ఆదివారం మిర్యాలగూడ, నాగార్జునసాగర్, దేవరకొండ నియోజకవర్గాల పరిధిలో కాంగ్రెస్, యూత్ కాంగ్రెస్ నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విగ్రహాలు, చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. భారతదేశం గర్వించదగ్గ వ్యక్తి అని రాజీవ్ గాంధీ అని, రాజీవ్ గాంధీ దేశానికి చేసిన సేవలు చిరస్మరణీయమని పలువురు నాయకులు, కార్యకర్తలు కొనియాడారు.

– సాక్షి నెట్‌వర్క్



మిర్యాలగూడ: రాజీవ్‌గాంధీ విగ్రహానికి నివాళి అర్పిస్తున్న శంకర్‌నాయక్, బత్తుల లక్ష్మారెడ్డి



హాలియా: రాజీవ్‌గాంధీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు



దేవరకొండ: నివాళులర్పిస్తున్న యూత్ కాంగ్రెస్ నాయకులు



త్రిపురారం: నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు



నిడమనూరులో..



కొండమల్లేపల్లిలో..



నాగార్జునసాగర్‌లో..

సమస్యలు పరిష్కరించాలని ఎమ్మెల్యేకు వినతి



ఎమ్మెల్యే నోముల భగత్‌కి వినతిపత్రం అందజేస్తున్న రేషన్ డీలర్లు

హాలియా: తమ సమస్యలను సీఎం కేసీఆర్ దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారమయ్యేలా కృషి చేయాలని రేషన్ డీలర్ల సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పారేపల్లి నాగరాజు, వైద్యుల సత్యనారాయణ ఆదివారం హాలియాలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నాగార్జునసాగర్ ఎమ్మెల్యే నోముల భగత్‌కి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రేషన్ డీలర్లకు వేతనం ఇవ్వాలని, గోదాం పాయింట్లలో వే బ్రిడ్జిలను ఏర్పాటు చేయాలని, డీలర్‌కు రూ.10 లక్షల ఇన్సూరెన్స్ కల్పించాలని, కరోనా సమయంలో మరణించిన 99 మంది రేషన్ డీలర్లకు ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలని, కారుణ్య నియామకాల గరిష్ట వయోపరిమితి 50 సంవత్సరాలకు పెంచాలని, ప్రతి క్వింటాకు 1 శాతం తరుగుదల ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో మిర్యాలగూడ డివిజన్ అధ్యక్షుడు పగిల్ల వెంకటేశ్వర్లు, అనుముల, త్రిపురారం, నిడమనూరు, తిరుమలగిరి, పెద్దవూర మండలాల అధ్యక్షుడు కోట్ల అశోక్, యూసుఫ్, మోహన్, దత్తు, వెంకటేశం, హాలియా పట్టణ డీలర్లు సముద్రాల దామోదర్, నామలింగయ్య, ధనలక్ష్మి, శ్రీనివాస్, మధన్ మోహన్ తదితరులు ఉన్నారు.

ప్రేమ జంట వివాహం

- పోలీసులను ఆశ్రయించిన దంపతులు
- వధూవరుల తల్లిదండ్రులకు కౌన్సెలింగ్

మాడుగులపల్లి: ఒకరినొకరు విడిచి ఉండలేక ప్రేమ జంట వివాహం చేసుకుంది. తాము మేజర్లమని న్యాయం చేయాలని మాడుగులపల్లి పోలీసులను ఆశ్రయించింది. ఈ ఘటనకు సంబంధించి గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని గుర్రప్పగూడెం గ్రామానికి చెందిన యువకుడు, మాడుగులపల్లికి చెందిన యువతి కొన్నేళ్లుగా ప్రేమించుకుంటున్నారు. ఇద్దరూ ఒకే సామాజిక వర్గానికి చెందిన వారు. వీరి ప్రేమకు తల్లిదండ్రులు అడ్డు చెప్పడంతో కోవిడ్ సమయంలో ఇంట్లో నుంచి వెళ్లిపోయారు. ఈ క్రమంలో యువతి తల్లిదండ్రులు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో పెద్దల సమక్షంలో పంచాయితీ జరిగింది. పెద్ద మనుషుల నిర్ణయంతో ఒకరికొకరు దూరం కావాల్సి వచ్చింది. కానీ విడిపోయి ఉండలేక ఇరువురు ఇటీవల మళ్లీ ఇంట్లో నుంచి వెళ్లి వివాహం చేసుకున్నారు. తమకు న్యాయం చేయాలని ఆదివారం మాడుగులపల్లి పోలీస్ స్టేషన్‌కు వచ్చారు. ఇద్దరు మేజర్లు కావడంతో పోలీసులు వారి తల్లిదండ్రులను పిలిచి కౌన్సెలింగ్ ఇవ్వడంతో రిసెప్షన్‌కు అంగీకరించినట్లు సమాచారం.

చివరి గింజ వరకూ కొనుగోలు చేస్తాం

డిండి: రైతులు పండించిన చివరి గింజ వరకూ కొనుగోలు చేస్తామని అదనపు కలెక్టర్ భాస్కర్‌రావు అన్నారు. ఆదివారం మండల కేంద్రంతో పాటు మండలంలోని టి.గౌరారం స్టేజీ వద్ద పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన పరిశీలించి మాట్లాడారు. డిండి మండలంలో ఆలస్యంగా ధాన్యం కొనుగోళ్లు ప్రారంభం కావడంపై సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. కొనుగోలు కేంద్రాల వద్ద వ్యవసాయాధికారులు అందుబాటులో లేకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆయన వెంట జిల్లా పౌరసరఫరాల శాఖ ఇన్‌చార్జి డిప్యూటీ తహసీల్దార్ శ్రీనివాస్‌గౌడ్, తహసీల్దార్ చంద్రశేఖర్, ఆర్‌ఐ గోపరాజు, సీఈఓ బాల్‌రెడ్డి తదితరులున్నారు.



డిండి: కొనుగోలు కేంద్రంలో వరి ధాన్యాన్ని పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ భాస్కర్‌రావు

ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టాలి

చందంపేట: ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపట్టాలని అదనపు కలెక్టర్ భాస్కర్‌రావు సూచించారు. ఆదివారం నేరెడుగొమ్ము మండల కేంద్రంతో పాటు పెద్దమునిగల్, పేర్వాల గ్రామాల్లోని ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన పరిశీలించారు. ఆయన వెంట డీటీ సీఎస్ శ్రీనివాస్‌గౌడ్, పీఏసీఎస్ చైర్మన్ బాలయ్య, ఏఓ శివరాం, రాజు, బషీర్ తదతరులున్నారు.

ధాన్యం త్వరగా దిగుమతయ్యేలా చూడాలి

కొండమల్లేపల్లి: కొనుగోలు కేంద్రాల నుంచి లారీల్లో వచ్చే ధాన్యాన్ని త్వరగా దిగుమతి చేసుకునేలా చర్యలు చేపట్టాలని అదనపు కలెక్టర్ భాస్కర్‌రావు మిల్లర్లను ఆదేశించారు. ఆదివారం మండల కేంద్రంలోని సాయిలక్ష్మి, శ్రీ గణేశ్ సాయి బాలాజి, సాయి వెంకటేశ్వర మిల్లుల గోదాంలలో ధాన్యం దిగుమతిని పరిశీలించారు. ఆయన వెంట ఆర్డీఓ గోపిరాం, చందంపేట, నేరెడుగొమ్ము తహసీల్దార్లు దేవదాసు, అరుణ, డిప్యూటీ తహసీల్దార్ హన్మంతు శ్రీనివాస్‌గౌడ్, మిల్లు యజమానులు కిరణ్‌కుమార్, అలుగుబెల్లి శ్రీనివాస్‌రెడ్డి తదితరులున్నారు.

బీఎస్పీ నియోజకవర్గ ప్రధాన కార్యదర్శిగా వెంకటేశ్వర్లు

హాలియా: బహుజన సమాజ్ పార్టీ(బీఎస్పీ) రాష్ట్ర అధ్యక్షుడు ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ ఆదేశాల మేరకు నాగార్జునసాగర్ నియోజకవర్గ పార్టీ ప్రధాన కార్యదర్శిగా మండలంలోని చల్మారెడ్డిగూడెం గ్రామానికి చెందిన ముదిగొండ వెంకటేశ్వర్లును నియమిస్తూ ఆదివారం హైదరాబాద్‌లో జరిగిన ఓ కార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు పూదరి సైదులు నియామకపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ ముదిగొండ వెంకటేశ్వర్లును అభినందించారు.

తప్పుడు ఆరోపణలు చేస్తున్నారు

- ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తా
- నిడమనూరు ఎస్‌ఐ శోభన్‌బాబు

నిడమనూరు: తనపై కొందరు తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని, వారిపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తానని నిడమనూరు ఎస్‌ఐ శోభన్‌బాబు అన్నారు. నిడమనూరు పోలీస్ స్టేషన్‌లో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. మండలంలోని నారమ్మగూడేనికి చెందిన దుబ్బాకుల రాంరెడ్డి, ఆయన సమీప బంధువు మునగాల పద్మ గొడవ పడడంతో మునగాల పద్మకు చెయ్యి విరిగిందని, ఇరు వర్గాల ఫిర్యాదుతో ఇరువురిపై కేసు నమోదు చేశామని తెలిపారు. ఇది స్టేషన్ బెయిల్ ఇచ్చే కేసు కానందున కోర్టుకు అప్పగించామని అన్నారు. కానీ తాను లంచం డిమాండ్ చేసినట్లు దుబ్బాకుల రాంరెడ్డి కుమారుడు అమెరికాలో ఉంటూ తనపై తప్పుడు వాట్సాప్ చాటింగ్ సృష్టించి సోషల్ మీడియాలో దుష్ప్రచారం చేస్తున్నాడని అన్నారు. వారిపై సైబర్ క్రైం పోలీసులకు ఫిర్యాదు చేస్తానని ఎస్‌ఐ తెలిపారు.



మాట్లాడుతున్న ఎస్‌ఐ శోభన్‌బాబు

ఎస్‌ఐపై వచ్చిన ఆరోపణలు..

నారమ్మగూడేనికి చెందిన దుబ్బాకుల రాంరెడ్డి, ఆయన సమీప బంధువు మునగాల పద్మకు అప్పు ఇచ్చాడు. ఆమె అప్పు తీర్చక పోవడంతో కోర్టుకు వెళ్లాడు. కాగా ఏప్రిల్ 30న అప్పు చెల్లించే విషయమై ఇరువురు గొడవ పడ్డారు. రాంరెడ్డితో పాటు అతడి కుమారుడు కుశలవరెడ్డి, మరో వ్యక్తి సిద్దార్థరెడ్డి తనపై దాడి చేయడంతో చెయ్యి విరిగిందని, మునగాల పద్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ముగ్గురిపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ కేసులో కుశలవరెడ్డి, సిద్దార్థరెడ్డికి సంబంధం లేదని, వారిద్దరి పేర్లు ఎఫ్‌ఐఆర్ నుంచి తీసేయాలని అమెరికాలో ఉంటున్న దుబ్బాకుల రాంరెడ్డి పెద్ద కుమారుడు రిక్కిరెడ్డి నిడమనూరు ఎస్‌ఐ శోభన్‌బాబుతో ఫోన్‌లో మాట్లాడడంతో పాటు వాట్సాప్ చాటింగ్ కూడా చేసినట్లు ఆరోపణలు వచ్చాయి. వారిద్దరి ఇద్దరి పేర్లు ఎఫ్‌ఐఆర్ నుంచి తీసేయాలంటే రూ.2లక్షలు లంచం ఇవ్వాలని ఎస్‌ఐ శోభన్‌బాబు డిమాండ్ చేసినట్లు రిక్కిరెడ్డి ఆరోపిస్తున్నాడు. వాట్సాప్ చాటింగ్ ఉందని రిక్కిరెడ్డి దానిని సోషల్ మీడియాలో పెట్టాడు. పోలీసు ఉన్నతాధికారులు స్పందించి దీనిపై విచారణ జరపాలని ఇరు వర్గాలు కోరుతున్నారు.

ఆన్‌లైన్ విద్యా యాప్‌పై అవగాహన



ఆన్‌లైన్ విద్యా యాప్‌పై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న హెచ్‌ఎం సైదులు

తిరుమలగిరి(నాగార్జునసాగర్): వేసవిలో విద్యార్థులు చదువుకు దూరం కాకుండా ఇంటి వద్ద ఉండే విద్యనభ్యసించేలా రాష్ట్ర విద్యాశాఖ ప్రత్యేక యాప్‌ను అందుబాటులోకి తీసుకువచ్చింది. ఈ యాప్‌పై మండలంలోని శిల్గాపురం ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కట్టెబోయిన సైదయ్య ఆదివారం శిల్గాపురం గ్రామంలోని విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ యాప్‌ను ఎలా వినియోగించాలి, యాప్ ముఖ్య ఉద్దేశ్యాన్ని విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు వివరించారు. ఈ యాప్‌లో తెలుగు, ఇంగ్లిష్, గణితం సబ్జెక్ట్‌లకు సంబంధించిన ప్రశ్నలకు సమాధానం చేసినట్లయితే మార్కులు సాధించవచ్చని ఆయన పేర్కొన్నారు. ప్రభుత్వం తీసుకువచ్చిన ఆన్‌లైన్ విద్యావిధానం పేద విద్యార్థులకు ఎంతగానో ఉపయోగపడుతుందని అన్నారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు ఎరనాగుల సైదులు ఉన్నారు.

అర్హులైన నిరుపేదలందరికీ ఇళ్ల పట్టాలు ఇవ్వాలి

మిర్యాలగూడ అర్బన్: పట్టణంలోని ఈదులగూడలో తాగునీటి సమస్యను పరిష్కరించడంతో పాటు నిరుపేదలందరికీ ఇళ్ల పట్టాలు ఇవ్వాలని మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి అన్నారు. ఆదివారం పట్టణంలోని ఈదులగూడలో పర్యటించిన ఆయన ఇంటింటికి వెళ్లి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. గతంలో వేసిన తాగునీటి పైప్‌లైన్, బోరింగ్‌లు తప్ప ఎక్కడా కొత్తగా అభివృద్ధి జరగలేదని అన్నారు. కాలనీల్లో కనీస వసతులు లేకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, అర్హులైన ప్రతి ఒక్కరికి పెన్షన్, తెల్ల రేషన్ కార్డు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు డబ్బికార్ మల్లేష్, నాయకులు మల్లు గౌతంరెడ్డి, రెమడాల పరశరాములు, మంగారెడ్డి, వీరారెడ్డి, పాపారావు, పాషా, ఫాతిమా, వెంకటమ్మ, జానమ్మ, రాములమ్మ తదితరులున్నారు.



ఈదులగూడలో ప్రజల సమస్యలను అడిగి తెలుసుకుంటున్న జూలకంటి రంగారెడ్డి

బీఆర్‌ఎస్ ప్రభుత్వంతోనే గ్రామాల అభివృద్ధి

పెద్దఅడిశర్లపల్లి: బీఆర్‌ఎస్ ప్రభుత్వంతోనే తెలంగాణలో గ్రామాలు అభివృద్ధి చెందాయని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు, దేవరకొండ ఎమ్మెల్యే రమావత్ రవీంద్రకుమార్ అన్నారు. మన ఊరు–మన ప్రభుత్వం–మన పథకాలు కార్యక్రమంలో భాగంగా ఆదివారం పెద్దఅడిశర్లపల్లి మండలంలోని దుగ్యాల, పిల్లిగుంటతండా గ్రామాలలో రూ.65లక్షలతో చేపట్టిన పలు అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పిల్లిగుంటతండా లిఫ్ట్ ఏర్పాటుకు కృషి చేస్తానన్నారు. దేశంలో ఎక్కడా లేని సంక్షేమ పథకాలను తెలంగాణలో అమలు చేస్తున్న ఘనత సీఎం కేసీఆర్‌దేనన్నారు. మండలంలోని దుగ్యాల గ్రామానికి చెందిన వివిధ పార్టీల కార్యకర్తలు ఎమ్మెల్యే సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. కార్యక్రమంలో ఎంపీపీ వంగాల ప్రతాపరెడ్డి, సర్పంచ్ నర్రావుల జయమ్మలచ్చిరెడ్డి, ఏడుకొండల్‌యాదవ్, విజయేందర్‌రెడ్డి, శీలం శేఖర్‌రెడ్డి, అర్వపల్లి నర్సింహ, పరమేష్, యాదగిరి తదితరులున్నారు.



దుగ్యాల గ్రామంలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే రవీంద్రకుమార్

26న 'మిర్యాల'లో మంత్రుల పర్యటన

మిర్యాలగూడ: మిర్యాలగూడ నియోజకవర్గంలో ఈ నెల 26న రాష్ట్ర వైద్యారోగ్యశాఖ మంత్రి తన్నీరు హరీష్‌రావు, విద్యుత్‌శాఖ మంత్రి గుంటకండ్ల జగదీష్‌రెడ్డి హాజరై పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేయనున్నట్లు స్థానిక ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్‌రావు తెలిపారు. ఆదివారం పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన నియోజకవర్గస్థాయి బీఆర్‌ఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. ఈ నెల 26న ఏరియా ఆసుపత్రిలో వంద పడకల భవన నిర్మాణానికి మంత్రులు శంకుస్థాపన చేయనున్నారని, అదేవిధంగా నియోజకవర్గవ్యాప్తంగా మంజూరైన 28 హెల్త్ సబ్ సెంటర్ల నిర్మాణానికి, పట్టణంలోని ఇందిరమ్మ కాలనీలో బస్తీ దవాఖానా నిర్మాణానికి మంత్రులు శంకుస్థాపన చేయనున్నట్లు తెలిపారు. మంత్రుల పర్యటనకు బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు భారీగా హాజరుకావాలన్నారు. సమావేశంలో మున్సిపల్ చైర్మన్ తిరునగరు భార్గవ్, వైస్ చైర్మన్ కుర్ర విష్ణు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే భాస్కర్‌రావు

తెలంగాణలోని గ్రామాలు దేశానికే ఆదర్శం

తిరుమలగిరి(నాగార్జునసాగర్): సీఎం కేసీఆర్ ప్రత్యేక చొరవతో అభివృద్ధిలో తెలంగాణలోని గ్రామాలు దేశానికే ఆదర్శంగా నిలిచాయని ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి అన్నారు. మండలంలోని యల్లాపురంతండా గ్రామపంచాయతీ పరిధిలోని చక్కోలంతండాలో రూ.20లక్షలతో చేపట్టిన సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేయడంతో పాటు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను స్థానిక నాయకులతో కలిసి ఆదివారం ఎమ్మెల్సీ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్ పార్టీ చేపడుతున్న సంక్షేమ పథకాలను కార్యకర్తలు, నాయకులు ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ ఆంగోతు సూర్యబాషానాయక్, ఎంపీపీ ఆంగోతు భగవాన్‌నాయక్, వైస్ ఎంపీపీ యడవల్లి దిలీప్‌రెడ్డి, స్థానిక సర్పంచ్ కొర్ర భిక్షానాయక్, సర్పంచులు జయరాంనాయక్, శాగం శ్రవణ్‌కుమార్‌రెడ్డి, జ్యోతి రామకృష్ణనాయక్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.



సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్సీ కోటిరెడ్డి

బీజేపీ, బీఆర్‌ఎస్ పార్టీలకు గుణపాఠం చెప్పాలి

గుర్రంపోడు: ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా ప్రజలను ఇబ్బందులు పెడుతున్న బీజేపీ, బీఆర్‌ఎస్ పార్టీలకు వచ్చే ఎన్నికల్లో ప్రజలు తగిన గుణపాఠం చెప్పాలని మాజీ మంత్రి కుందూరు జానారెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని మక్కపల్లి గ్రామంలో నిర్వహించిన కాంగ్రెస్ పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. దేశంలో ఎక్కువగా మద్యం అమ్మకాలు తెలంగాణలోనే జరుగుతున్నాయని ఆరోపించారు. పెరిగిన పెట్రోల్, డీజిల్, గ్యాస్, నిత్యావసర ధరలు, బస్సు చార్జీలతో పేద కుటుంబం కుదేలవుతుందన్నారు. అనంతరం ఇటీవల ప్రమాదవశాత్తు మరణించిన కాంగ్రెస్ కార్యకర్తల కుటుంబాలకు రూ.2లక్షల బీమా చెక్కులు అందించారు. పలువురు బీఆర్‌ఎస్ కార్యకర్తలు కాంగ్రెస్‌లో చేరగా జానారెడ్డి వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు తగుళ్ల సర్వయ్య, పార్టీ జిల్లా నాయకుడు కంచర్ల వెంకటేశ్వర్‌రెడ్డి, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ సూదిని జగదీశ్వర్‌రెడ్డి, లెంకల అశోక్‌రెడ్డి, కుప్ప రాములు, బొమ్ము శ్రీనివాస్, వెలుగు యాదయ్య, కుప్ప అమరేందర్‌గౌడ్, మేడి వెంకన్న తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కుందూరు జానారెడ్డి

పూర్వవిద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న కొపోల్లు జెడ్పీహెచ్‌ఎస్ 1991-92 బ్యాచ్

గుర్రంపోడు: మండలంలోని కొప్పోలు జెడ్పీహెచ్‌ఎస్‌లో 1991–92 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు ఆదివారం స్థానిక క్రాంతి ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన పూర్వ విద్యార్థుల సమ్మేళనంలో కలుసుకున్నారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు తమకు చదువు చెప్పిన గురువులను సన్మానించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు వెల్లపూరి కరుణాకర్‌రావు, పూర్వ విద్యార్థులు జింకల నగేష్, వెల్లపూరి శ్రీనివాసరావు, చింతరెడ్డి వేణుగోపాల్‌రెడ్డి, కొక్కు రాంబాబు, పెద్దిరెడ్డి వెంకటేశ్వర్‌రెడ్డి, బొల్లం అచ్చయ్య, బి. నాగయ్య తదితరులు పాల్గొన్నారు. పోచంపల్లి ఉన్నత పాఠశాలలో 2000–2001 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనంలో కలుసుకున్నారు. ఆనాటి ఉపాధ్యాయులు విష్ణువర్ధన్‌రెడ్డి, ధర్మయ్య, హసన్ ఖలీం, సైదానాయక్‌ను సన్మానించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ గుత్తా తిరుమల్‌రెడ్డి, జాల శంకర్, జెల్లా నరేందర్, పోలేని రమేష్, బైరు పరమేష్, వెంకన్న, మధు పాల్గొన్నారు.



పోచంపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాల 2000-2001 బ్యాచ్

సంక్షిప్త సమాచారం

డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలు.. ఆరుగురిపై కేసు

మిర్యాలగూడ టౌన్: మిర్యాలగూడ మండలం వెంకటాద్రిపాలెంలో ఆదివారం పోలీసులు డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలు నిర్వహించారు. మద్యం సేవించి వాహనాలు నడుపుతున్న ఆరుగురిపై కేసు నమోదు చేసినట్లు రూరల్ అదనపు ఎస్‌ఐ ముత్యాల రాంమ్మూర్తి తెలిపారు.

మట్టి రోడ్డు పనులు ప్రారంభం

చందంపేట: నేరెడుగొమ్ము మండలంలోని మోసంగడ్డతండాలో రైతులు వ్యవసాయ పొలానికి వెళ్లేందుకు గాను రూ.5లక్షలతో చేపట్టిన మట్టి రోడ్డు పనులను ఆదివారం ఎంపీపీ పద్మాహన్మానాయక్ గ్రామ సర్పంచ్ హంస్యానాయక్‌తో కలిసి ప్రారంభించారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ అంబలి, శ్రావణ్, హన్మానాయక్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో ఆవు మృతి

చందంపేట: నేరెడుగొమ్ము మండలం పెద్దమునిగల్‌లో ఆదివారం విద్యుదాఘాతంతో ఆవు మృతి చెందింది. వివరాలు.. గ్రామానికి చెందిన చిమట నాగమ్మ తన పాడి ఆవును ఆదివారం కూడా మేతకు తోలుకెళ్తుండగా గ్రామంలోని ట్రాన్స్‌ఫార్మర్ స్తంభం వద్ద ఆవు విద్యుత్ షాక్‌కు గురై మృతిచెందింది. ఆవు విలువ రూ.50వేలు ఉంటుందని బాధితురాలు పేర్కొంది. విద్యుత్ అధికారులు నష్టపరిహారం చెల్లించాలని బాధితురాలు కోరుతోంది.

నాణ్యమైన విత్తనాలు విక్రయించాలి

దేవరకొండ: రైతులకు నాణ్యమైన విత్తనాలు విక్రయించాలని దేవరకొండ సీఐ శంకర్ అన్నారు. ఆదివారం మండల పరిధిలోని కొండభీమనపల్లి రైతువేదికలో ఫర్టిలైజర్ దుకాణాదారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. విత్తనాలు కొనుగోలు చేసిన రైతులకు తప్పనిసరిగా రశీదు ఇవ్వడంతో పాటు దుకాణాదారులు రశీదు పుస్తకంలో రైతుల సంతకాలను తీసుకోవాలని సూచించారు.

బీఎస్పీలో చేరిక

పెద్దవూర: మండలంలోని చింతపల్లికి చెందిన వల్కి సుధాకర్ ఆదివారం బహుజన్ సమాజ్ పార్టీ(బీఎస్పీ) రాష్ట్ర అధ్యక్షుడు ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ సమక్షంలో హైదరాబాద్‌లోని పార్టీ కార్యాలయంలో బీఎస్పీలో చేరారు. కార్యక్రమంలో నియోజకవర్గ ఇన్‌చార్జి ఆదిమళ్ల వెంకటేష్, తంగెళ్ల సత్యనారాయణరాజు, కుక్కమూడి ముత్యాలు తదితరులున్నారు.

జాతర నిర్వహణకు ఆర్థికసాయం

మిర్యాలగూడ టౌన్: మిర్యాలగూడ మండలం యాద్గార్‌పల్లిలో గంగ దేవమ్మ జాతర సందర్భంగా జాతరకు కావాల్సిన వస్త్ర, సామగ్రి కొనుగోలుకు గాను జిల్లా రైతు బంధు సమితి అధ్యక్షుడు చింతరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి ఆదివారం రూ.10వేల ఆర్థిక సాయం యాదవ సంఘం సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ భోగబోయిన రాజు, బీఆర్‌ఎస్ గ్రామ అధ్యక్షుడు సకినాల హరిప్రసాద్, మాజీ సర్పంచ్ దారం సైదులు, మాజీ ఎంపీటీసీ రవీంద్రవర్మ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

మార్మోగిన సాయి నామస్మరణం



కల్యాణం నిర్వహిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

చింతపల్లి: మండల కేంద్రంలోని శ్రీ షిర్డీ సాయినాథుని దేవాలయం ఆదివారం సాయి నామస్మరణతో మార్మోగింది. ఆలయ 16వ వార్షికోత్సవాలలో భాగంగా తెల్లవారుజాము నుంచే ప్రత్యేక పూజా కార్యక్రమాలతో పాటు అభిషేకాలు నిర్వహించారు. అనంతరం సుబ్రహ్మణ్యేశ్వరస్వామి దివ్య కల్యాణ మహోత్సవం కనుల పండువగా సాగింది. భక్తులకు ఆలయ కమిటీ సభ్యులు అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ మంచికంటి ధనుంజయ్య, ప్రధాన కార్యదర్శి కొమిరిశెట్టి వెంకటయ్య, తదితరులు పాల్గొన్నారు.